www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 10 | సెప్టెంబర్ | 2026
పేజీలు : 8

## ఆటలు ఆడుతూ గురుకుల విద్యార్థి మృతి



-ఆసుపత్రి వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

2లో



### విస్తరణ జరిగితే..

# శాఖల మార్పు తప్పదా..?







**-ఆ ముగ్గురి చేతుల్లోనే ప్రధాన శాఖలు**

**-శాఖల మార్పుపై విస్తృత చర్చ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో జరుగుతున్న వివిధ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ పై విస్తృత చర్చ సాగుతుంది. గత కొన్ని నెలలుగా మంత్రి వర్గ విస్తరణ గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలోనే కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత మంత్రి వర్గంలో మార్పులు జరగక తప్పని పరిస్థితి ఏర్పడింది. కొండా సురేఖ స్థానంతో పాటు గతంలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఖమ్మంజిల్లాకు సంబంధించిన మంత్రుల శాఖల్లో మార్పు తప్పదన్న ప్రచారం సాగుతుంది. ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ముగ్గురు మంత్రులు ఉండగా ఈ ముగ్గురు కూడా ప్రధాన శాఖలను నిర్వహిస్తుండటం విశేషం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న

మిగతా 2లో..

## చెరువు నిండా నీళ్లు..

# ఎండుతున్న వరి పొలాలు..!

-ఆవేదనలో రైతన్నలు




**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని పులిగుండాల ప్రాజెక్టులో చెరువు నిండా 13 అడుగుల నీటి సామర్థ్యం నిలువ ఉన్న ఖరీఫ్ సీజన్లో సాగు చేసుకున్న బ్రహ్మలకుంట, బత్తులపల్లి గ్రామానికి చెందిన రైతులకు పులిగుండాల ప్రాజెక్టు నుంచి కాలవ ద్వారా నీరు వదలక వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పులిగుండాల ప్రాజెక్టు పెనుబల్లి మండలం పరిధిలో ఉంది. ఈ ప్రాజెక్టు కింద అధికారికంగా 900 ఎకరాలు సాగులోకి వస్తుండగా అనధికారికంగా ఇంకో 800 ఎకరాలు సాగులోకి వస్తుంది. గత ఏడాది రబి సీజన్ లో చెరువులో నీళ్లు ఉన్నా వదలకపోవటంతో వివాదం జరిగి అనంతరం ప్రజా ప్రతినిధుల దృష్టికి వెళ్ళటం వాళ్లు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో నీళ్లు వదిలారు. అప్పుడు పంట చేతికి దక్కింది. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు

మిగతా 2లో..

## అర్ధరాత్రుల్లో

# బెల్ట్ జోరు..!





**-ఇళ్లు, కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు**

**-బెల్ట్ షాప్ నిర్వాహకులకు వైన్స్ యజమానుల అండ**

**-ఎక్సైజ్ అధికారులు ఉక్కు పాదం మోపెనా..?**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని పల్లె ప్రాంతాల్లో అక్రమ బెల్ట్ షాపుల దందా విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఒకప్పుడు రహస్యంగా సాగిన బెల్ట్ షాపుల వ్యవహారం ఇప్పుడు బహిరంగంగానే కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రుల్లో బెల్ట్ షాపుల దందా విచ్చలవిడిగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో కిరాణా దుకాణాలు, ఇళ్లను అడ్డాగా చేసుకుని అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు

మిగతా 2లో..

## వైద్య పరీక్షల

# దోపిడీ..!





**-జబ్బు ఏదైనా పరీక్షలు తప్పనిసరి**

**-ల్యాబులతో ప్రైవేటు ఆసుపత్రుల ఒప్పందాలు**

**-పేరుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పోరేట్ వైద్యం**

**-సతమతమవుతున్న సామాన్యులు**

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఆరోగ్యం ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరం. అనారోగ్యం వచ్చినప్పుడు సామాన్యుడు ముందుగా ఆలోచించేది మంచి వైద్యం ఎక్కడ లభిస్తుంది, ఖర్చు ఎంత అవుతుంది అనే ప్రశ్నలే. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనుభవజ్ఞులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ అనేక చోట్ల మౌలిక సదుపాయాల కొరత, పరికరాల లేమి, నిర్వహణలో లోపాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మరో వైపు కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యాధునిక సదుపాయాలు, మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉండడంతో ప్రజలు అక్కడికి వెళ్లాల్సి వస్తుంది. అయితే కొన్ని సందర్భాల్లో రోగికి అవసరమా

మిగతా 2లో..

# విస్తరణ జరిగితే.. శాఖల మార్పు తప్పదా..?

**(మొదటిపేజీ తరువాయి)**
మల్లు భట్టివిక్రమార్క ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖలను నిర్వహిస్తున్నారు. సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖలను నిర్వహిస్తుండగా రాష్ట్రంలోని ప్రధానమైన రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖలను పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహిస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ జరిగితే శాఖల్లో సైతం మార్పులు వచ్చి ఖమ్మం జిల్లా మంత్రులు నిర్వహిస్తున్న శాఖలు కొన్నింటిని మారుస్తారని చర్చ సాగుతుంది. ఏ మంత్రి వద్ద నుంచి ఏ శాఖను తొలగించి ఏ శాఖ బాధ్యతను అప్పగిస్తారన్న దానిపై స్పష్టత లేకున్నా మార్పు ఖాయమన్న ప్రచారం జరుగుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపులో ఉమ్మడి ఖమ్మంజిల్లా కీలక భూమిక పోషించింది. ఇక్కడ పది స్థానాల్లో ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందగా మరో స్థానంలో కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి గెలుపొందారు. భద్రాచలం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో కాంగ్రెస్ శాసన సభ్యుల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. ఖమ్మంజిల్లా నుంచి మంత్రి వర్గంలో ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు కూడా బలమైన అభ్యర్థులు కావడం కేవలం ఈ జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనుచర గణాన్ని కలిగిఉండడంతో శాఖల్లో మార్పులు ఉన్న మంత్రి వర్గంలో కొనసాగడంలో మాత్రం ఎటువంటి ఢోకా లేదన్న వాదన వినపడుతుంది. మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడు జరుగుతుందన్న దానిపై ఖచ్చితమైన సమాచారం లేకున్నా జిల్లా నుంచి మరొకరికి అవకాశం దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ ముగ్గురి మధ్యనే శాఖల మార్పులు తప్ప మంత్రి వర్గ విస్తరణపై మిగతా ఎవరికి ఎటువంటి ఆశలు లేవన్నది స్పష్టం.

# అర్ధరాత్రుల్లో ‘బెల్ట్’ జోరు..!



**(మొదటిపేజీ తరువాయి)**విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాల్లో లభించే ధరల కంటే అధిక ధరలకు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారని, రాత్రి వేళల్లోనూ విక్రయాలు కొన సాగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో కూలీలు, పేద కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు పగలు రాత్రి అనే తేడా లేకుండా వైన్స్ నుండి ద్విచక్ర వాహనాలు, ఆటోల పై మద్యాన్ని తరలిస్తున్నారు. బెల్టు షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రాయి స్తున్నా కూడా, బెల్ట్ షాపు నిర్వహకులకు వైన్స్ యాజమాన్యం కొండంత అండగా ఉంటున్నారు. మీ దగ్గరికి ఎవరూ రారు. మేము చూసుకుంటాం అని బెల్ట్ షాపు నిర్వహకులకు వైన్స్ యాజమాన్యం భరో సానిస్తున్నారు.

### అనుమతులు లేకుండానే అమ్మకాలు...?

మద్యం విక్రయాలకు ఎలాంటి అనుమతులు లేని ప్రాంతాల్లోనూ బాటిళ్లు అందుబాటులోఉంటున్నాయని స్థానికులు అంటున్నారు. నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని, అర్ధరాత్రుళ్ళో అవసరమైన సమయంలో ఎక్కడికెళ్లినా మద్యం దొరికే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.

### ఒక్కో గ్రామంలో పది వరకు బెల్ట్ షాపులు...

ఒక్కో గ్రామంలో సుమారుగా పది షాపుల వరకు ఉంటాయి. ఇందులో రోజుకు ఒక్కో షాపులో సుమారుగా రూ.5 వేల నుంచి 10 వేల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. అంటే 10 షాపులకు రూ. 50 వేల నుంచి లక్ష వరకు ఒక్కో గ్రామంలోనే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో గ్రామంలోనే రోజుకు రూ. లక్ష వరకు మద్యం అమ్మకాలు జరిగితే మండల వ్యాప్తంగా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు

### ఎక్సైజ్ శాఖ పై మామూళ్ల ఆరోపణలు...

అక్రమ బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి కొందరు అధికా రులకు నెల వారీ మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతి నెల ఎక్సైజ్ శాఖలోని కొంత మంది అధికారులు సిబ్బంది గ్రామాల్లో నిర్వహించే బెల్టు షాపు నిర్వాహకుల నుండి మామూలు వసూలు చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు దాడులు చేసే సమయంలో బెల్టు షాపు నిర్వాహకులకు సమాచారం అందిస్తున్నారని ఆరోపణలు కూడా చర్చలుగా సాగుతున్నాయి.

### కుటుంబాల్లో కలహాలు..ఆర్థిక ఇబ్బందులు...

మద్యపానానికి బానిసైన కొందరు వ్యక్తుల కారణంగా కుటుంబాల్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రోజువారీ కూలీ డబ్బులు మద్యం కోసం ఖర్చు చేయడంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని పలువురు వాపోతున్నారు.

# వైద్య పరీక్షల దోపిడీ..!



**(మొదటిపేజీ తరువాయి)** కాదా అనే విషయంపై స్పష్టత లేకుండానే వరుసగా వైద్య పరీక్షలు చేయించడం, ఖరీదైన స్కానింగ్‌లు, వివిధ రకాల టెస్టులు సూచించడం వల్ల చికిత్స ఖర్చు భారీగా పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రతి రోగికి టెస్టుల పరంపర...

ప్రైవేట్ వైద్యంలో ఆధునిక పరీక్షలు రోగ నిర్ధారణకు ఎంతో ఉపయోగపడతాయి. అయితే వైద్యపరంగా అవసరమైన పరీక్షలకే పరిమితం కావాలని ప్రజలు కోరుతున్నారు. అవసరం లేని పరీక్షలు చేయించడం వల్ల రోగికి ఆర్థిక భారం పెరగడంతో పాటు ఆందోళన కూడా పెరుగుతుంది. అదేవిధంగా ఆపరేషన్ అవసరం లేని సందర్భాల్లో కూడా శస్త్ర చికిత్సలు సూచిస్తున్నారనే ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. అయితే ప్రతి ఆపరేషన్‌ను అవసరం లేనిదిగా భావించడం కూడా సరి కాదు. సరైన వైద్య సలహా, రెండో అభిప్రాయం తీసుకోవడం రోగులకు ఎంతో ఉపయోగకరం.

### నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే ఆధారం...

రోజు వారి కూలీలు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన కార్పొరేట్ వైద్యం భారంగా మారుతుంది. ఆసుపత్రి ఖర్చులు, పరీక్షలు, మందులు, శస్త్ర చికిత్సలు కలిపి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రులు బలపడితే సామాన్య ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుంది. అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు, మందులు, నిపుణులైన సిబ్బంది, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటే ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతుల కొరత...

ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో కొరతతో పాటు ఆధునిక పరికరాలు లేకపోవడంతో రోగులు పట్టణ ప్రాంత కార్పొరేట్ వైద్యశాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడ సిబ్బందిని నియమించి అత్యవసర పరికరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కావాలి...

ప్రభుత్వ వైద్యశాలలను కేవలం పేదల ఆసుపత్రులుగా కాకుండా అందరికీ నాణ్యమైన వైద్యం అందించే ఆధునిక వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఆధునిక డయాగ్నస్టిక్ పరికరాలు , 24 గంటల అత్యవసర సేవలు, నిపుణులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మందుల లభ్యత, పరిశుభ్రమైన వార్డులు, మెరుగైన పారిశుధ్యం వంటి సౌకర్యాలను పెంచాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపడితే సామాన్యులు మాత్రమే కాకుండా మధ్యతరగతి ప్రజలు కూడా ప్రభుత్వ వైద్యాన్ని విశ్వసించే పరిస్థితి ఏర్పడుతుంది.

### ప్రభుత్వం దృష్టిసారించాలి...

వైద్యం వ్యాపారంగా మారకుండా రోగి కేంద్రంగా కొనసాగేందుకు ప్రభుత్వ పర్యవేక్షణ మరింత బలపడాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో పారదర్శక బిల్లింగ్, అవసరమైన పరీక్షలపై స్పష్టమైన సమాచారం, చికిత్సకు సంబంధించిన వివరాలు, రోగి హక్కులపై అవగాహన కల్పించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేస్తేనే పేద, మధ్యతరగతి ప్రజలకు నిజమైన ఆరోగ్య భద్రత లభిస్తుంది. వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి. ఆరోగ్యం డబ్బున్న వారికే పరిమితం కాకూడదు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే దీనికి శాశ్వత పరిష్కారం.

# ఆటలు ఆడుతూ గురుకుల విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని మహాత్మ జ్యోతిబా పూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో విషాదం చోటు చేసుకుంది. ఎనిమిదవ తరగతి చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థి బుధవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి ఆటలు ఆడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గుర్తించిన పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. ఆకస్మికంగా గుండెపోటుతో సాత్విక్ మృతిచెంది ఉండవచ్చునని ప్రాథమికంగా భావిస్తున్నారు. మరణానికి ఖచ్చితమైన కారణాలు, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే తెలుస్తాయని అధికారులు తెలిపారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన హరీష్, ప్రియాంక దంపతుల కుమారుడు సాత్విక్‌ను ఉన్నతంగా చదివించాలనే ఆశతో గురుకుల పాఠశాలలో చేర్పించారు. కుటుంబ పోషణ కోసం వీరు హైదరాబాద్‌లో రోజు వారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతిచెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రి వద్దకు వచ్చి గుండెలు అవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడ ఉన్న వారిని కలిచివేశాయి. విద్యార్థి మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, ఆర్‌సిఎంలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఆర్డివో శ్రీనివాస్, ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్ సంఘటన స్థలంకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలతో మాట్లాడారు. అనారోగ్యంతో జరిగిన ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# చెరువు నిండా నీళ్లు..ఎండుతున్న వరి పొలాలు..!

**(మొదటిపేజీ తరువాయి)**
పులిగుండాల నుండి నీళ్లు విడుదల చేసేందుకు అంగీకరించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు చెప్పిన వివరాల ప్రకారం 300 ఎకరాలు ఎండిపోయే దశకు వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పులిగుండం ప్రాజెక్టు ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉండగా దాని పర్యవేక్షణ మాత్రం అటవీ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలియజేస్తే అటవీశాఖ చూస్తుంది అని తెలుపుతున్నారు. కాలవ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అంగీకరించటం లేదని రైతులు అంటున్నారు. పరిస్థితి ఇలా ఉంటే 300 ఎకరాల వరి సాగు ఎండిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే బీడు భూములుగా మారే ఎకరాల సంఖ్యకు కూడా పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కల్పించుకొని పులిగుండాల ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేసి వరి పంటను కాపాడాలని బత్తులపల్లి, బ్రహ్మలకుంట గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

# నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించండి

**-కలెక్టరేట్ వద్ద పివోడబ్ల్యూ ఆందోళన**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను అధికంగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపిందని ఆరోపించారు. మోడీ పాలనలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం ద్వారా సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడింద న్నారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్న మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని శిరోమణి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, నాయకులు గోకినేపల్లి సరోజిని, అనసూయ, సుగుణ, సునీత పాల్గొన్నారు.

# డిపివోకు పాలక వర్గం సన్మానం



**ప్రజాపక్షం/తల్లాడ :** జిల్లా పంచాయతీరాజ్ అధికారి వినోద్‌కుమార్ బుధవారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామ పంచాయతీని పరిశీలించారు. ఈ సందర్భంగా తొలిసారి గ్రామానికి వచ్చిన డిపివోను స్థానిక పాలక వర్గం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు లతో పాటు వార్డు మెంబర్లు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పివో రాంబాబు, కల్లూరు డిఆర్‌పివో విజయలక్ష్మి, హౌజింగ్ డిప్యూటీ ఇంజనీర్ జగ్రామ్, ఎంపిడివో శ్రీధర్ రాజు, ఎంపివో శ్రీహరి, హౌజింగ్ ఏఈ ఆస్మా, సెక్రటరీ వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పశువులలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు సూచించారు. మండలం లోని కట్టుకాచారంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిభిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థిక స్వాలంభన సాధించాలని సూచించారు. పశువులలో సీజనల్ గా వచ్చే వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉచిత పశు వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పశు సంపద ను మరింత పెంచాలన్నారు. వర్షాకాలం సీజన్లో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీ.సైదులు, చెరువుమాదారం వైద్యాధికారి సాహిత్య, సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, రామారావు, గోపాలమిత్ర బోయపాటి నారాయణరావు,ప్రసాద్, బోడ నాగరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ చట్టం 2018ను రద్దు చేయాలి



**-సర్పంచుల సమస్యలు పరిష్కరించండి**
**-సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**


**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018ని రద్దు లేదా సవరణ చేసి సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఖమ్మం జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బూరి నరహరి, ప్రధాన కార్యదర్శి బానోత్ భిక్షం నాయక్ లు మాట్లాడుతూ అధికారుల పెత్తనానికి ఆస్కారం ఇస్తున్న పంచాయతీరాజ్ చట్టం 2018ను రద్దు లేదా సవరణ చేయాలన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం 29 రకాల అధికారాలు, నిధులను పంచాయతీలకు బదలాయించాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న ఉప సర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరారు. పంచాయతీ విద్యుత్ బిల్లులను గతంలో మాదిరిగానే ప్రభుత్వమే చెల్లించాలని, స్థానిక సెస్సులు, మైనింగ్, స్టాంపు డ్యూటీ నిధులు నేరుగా పంచాయతీలకే జమ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించినవిధంగా మేజర్ పంచాయతీలకు రూ. 10 లక్షలు, మైనర్ పంచాయతీలకు ఐదు లక్షల నిధులు తక్షణమే విడుదల చేయాలన్నారు. గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 500 కోట్ల జనరల్ ఫండ్ బకాయిలు కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1090 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ. 2979 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని, ఇందిరమ్మ కమిటీల జీవోను రద్దు చేయాలని, తండాలకు రోడ్లు, భవనాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో స్వయం ప్రతిపత్తిని కాపాడి అభివృద్ధి నిధులను విడుదల చేయాలని కోరారు.

# హియరింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఎస్ఐఆర్‌లో భాగంగా ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం పరిశీలించారు. ఖమ్మం నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల, 35వ డివిజన్‌లో యోగాసన కేంద్రం, ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఈఆర్ వోలతో మాట్లాడి ఎంత మంది హాజరై హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు, ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి. పెండింగ్ ఎన్ని ఉన్నాయి, హియరింగ్ ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హియరింగ్ కేంద్రాలకు వచ్చిన ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. హియరింగ్ కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన ఫారాలు, ప్రక్రియకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా హియరింగ్ ప్రక్రియను సజావుగా చేపట్టాలన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌వోలు చిరంజీవి, నవ్యజ్యోతి, కిరణ్‌కుమార్, బిఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తిలో ఏఐ, ఐఓటీపై మూడు రోజుల వర్క్‌షాప్ ముగింపు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐ (కృత్రిమ మేధస్సు), ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్)పై నిర్వహించిన మూడు రోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఐఈటీఈ విజయవాడ, కిట్స్‌కార్ట్ హైదరాబాద్ సహకారంతో ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.కిట్స్‌కార్ట్ టెక్నాలజీ సీఎండీ జి.సూర్యప్రకాశ్ విద్యార్థులకు ఏఐ, ఐఓటీ సాంకేతికతల వినియోగం, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఏఐ, ఐఓటీ సాంకేతికతలు వివిధ రంగాల్లో విస్తరిస్తున్నందున విద్యార్థులు వాటిపై పట్టు సాధించాలని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేషారత్నకుమారి మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, గోప్యతను కాపాడుకుంటూ ఏఐ, ఐఓటీని బాధ్యతాయుతంగా వినియోగించాలని ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ పి.శేఖర్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో హెటిరో గ్రూప్ అధినేత, సాయిస్ఫూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్ట్ బండి అన్విద విద్యార్థులను వర్చువల్‌గా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్లు పి.నాగశేఖర్, ఎం.వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఫైర్

**పోలీసులకు ఫిర్యాదు**



ప్రజాపక్షం/సత్తుపల్లి: తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆయన మరణాన్ని కోరుకున్నారని ఆరోపించిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వీర్ల శంకర్‌ను వెంటనే అరెస్ట్ చేసి, కేసీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఎలాంటి వ్యాఖ్యలు చేసినా బీఆర్ఎస్ కార్యకర్తలు సహించబోరని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో ఇలాంటి రాజకీయ విష సంస్కృతిని ప్రోత్సహించడం మంచిది కాదన్నారు. అధికార కాంగ్రెస్ నేతల అండతోనే ఇలాంటి వ్యాఖ్యలు, దాడులు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజా సమస్యలను విస్మరించి ప్రతిపక్షాలపై దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పుర మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కౌన్సిలర్ బెల్లంకొండ రాము, మోరంపూడి ప్రభాకర్, మల్లూరి అంకమరాజు, అయూబ్ పాషా, వల్లభనేని పవన్, మోదుగు పుల్లారావు, విసంపల్లి వెంకటేశ్వరరావు, సుభాని, అజార్, బాబు, చాంద్ పాషా, అమరవరపు కృష్ణారావు, నడ్డి ఆనందరావు, జొన్నలగడ్డ విజయ్, ధనుంజయ్, పెద్దిరెడ్డి పురుషోత్తం, మరికంటి శ్రీను, మేకల శ్రీనివాసరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషం, విధ్వంస విధానాలతో పాలన

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ జరగకుండా వారి దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ నేతలు తాజా రాజకీయాలకు తెరలేపి డైవర్షన్ పొలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుందని ఆ అసంతృప్తి, వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ప్రజా సమస్యలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ప్రజలను తప్పుదోవపట్టించలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటారని పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు.

# కాళోజీ అడుగు జాడల్లో నడవాలి

**-కాళోజీ జయంతి వేడుకల్లో శిక్షణ కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ వైతాళికుడు, ప్రజా కవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జీవితం నేటి తరానికి ఆదర్శ నీయమని ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ తెలిపారు. కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను తన కలం బలం ద్వారా ఎండగట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ భాషా, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీ యమన్నారు. ప్రజా చైతన్యమే ఊపిరిగా జీవించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, కేర్‌టేకర్ వెంకన్న, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఖమ్మంలో జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న శుక్రవారం ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టిటిడిసి నందు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళా ద్వారా ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో సెంటర్ మేనేజర్, విత రోవ్, ఎల్ఆర్‌వో, రూరల్ మైక్రో లోన్స్ విభాగంలో 20 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్, డిప్లొమా లేదా డిగ్రీ అర్హత కలిగిన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని ఎంపికైన వారికి నెలకు రూ. 15వేలు జీతంతో పాటు ఇన్సెంటీవ్‌లు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా రిలయన్స్ జియో ఖమ్మం విభాగంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్ ఐదు ఖాళీలు ఉన్నాయని ఉపాధి కల్పన అధికారి తెలిపారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ పూర్తి చేసి 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న యువకులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 14వేల నుండి రూ. 25వేల వరకు వేతనం అందిస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.9448241214, 9391539320 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి తెలిపారు.

# కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా జక్కుల



**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం నూతన రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా జక్కుల రామారావు బుధవారం ఎన్నికయ్యారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లోని రాజబహదూర్ గౌర్ హాల్, ముగ్దుం భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రామారావు ఎన్నిక పట్ల సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం పశ్యపద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐకెఎస్ జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు అభినందనలు తెలిపారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని రామారావు తెలిపారు.

# చిన్న సమస్యలకే తీవ్ర నిర్ణయాలు వద్దు

**-మాట్లాడండి..ప్రాణాలను కాపాడండి**
**-డిఎంహెచ్‌ఓ డాక్టర్ రామారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** చిన్నపాటి సమస్యలు, నిరాశలు, వైఫల్యాలను తట్టుకోలేక ఆత్మహత్యలను పాల్పడటం ఆందోళనకరమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మహత్యలపై దృక్పథాన్ని మార్చుకుందాం.. సంభాషణను ప్రారంభిద్దాం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లలపై మార్కులు, ర్యాంకుల ఒత్తిడి పెంచకుండా మానసిక స్థైర్యం, జీవన నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతి రోజూ కొంత సమయం గ్యాడ్జెట్లను పక్కనపెట్టి పిల్లల సమస్యలను ఓపికగా వినాలని కోరారు. మానసిక ఆందోళన, నిరాశ లేదా ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారు టెలిమానస్ 14416 లేదా 18008914416కు 24 గంటలూ ఉచితంగా సంప్రదించాలని తెలిపారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, కుటుంబం, సమాజం అండగా నిలవాలని డాక్టర్ రామారావు తెలిపారు.

## కెసిఆర్‌కు భద్రత పెంచాలి



**ప్రజాపక్షం/దమ్మపేట:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రాణహాని కలిగించే కుట్ర జరిగిందనే ఆరోపణలపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఫిర్యాదు చేశారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు సూచనల మేరకు ఎస్ఐ బాలస్వామికి ఫిర్యాదు అందజేశారు. అసెంబ్లీలో రాజకీయ వాదనలను రెచ్చగొట్టేలా ఉపయోగించడం, అనంతరం పెద్ద సంఖ్యలో వాహనాల్లో వ్యక్తులు కేసీఆర్ నివాసముండే ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు వెళ్లడం, షాద్‌నగర్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. ఈకార్యక్రమంలో గాజుబోయిన యేసుబాబు, దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, యట్ల రామదాసు, దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, బుడే, వెలుగోటి మహేష్, పాకనాటి శ్రీను, కాసిని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గౌరారంలో సంపూర్ణ మద్యపాన నిషేధానికి తీర్మానం

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం గౌరారం గ్రామ పంచాయితీ పరిధిలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని కోరుతూ గ్రామసభలో తీర్మానం చేశారు. గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు చేసిన తీర్మాన ప్రతిని సర్పంచ్ శ్యామల రవివర్మ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి కిష్టయ్యకు అందజేసి, గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక పరిస్థితి, యువత భవిష్యత్తు, కుటుంబ కలహాలు, రోడ్డు ప్రమాదాలు, నేరాల నివారణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సర్పంచ్ తెలిపారు. మద్యపాన రహిత, ఆరోగ్యకరమైన, సురక్షిత గ్రామ నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎక్సైజ్ సీఐ కిష్టయ్య మాట్లాడుతూ గౌరారంలో మద్యం విక్రయాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని, నెలకు నాలుగుసార్లు తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు సమాచారం అందించి శాఖకు సహకరించాలని కోరారు.

## రైతులకు ఎరువులు నిత్యం అందుబాటులో ఉంచాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులను నిరంతరం అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వూకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతు వేదికలో వ్యవసాయ అధికారి అరుణ్ కుమార్‌కు సం ఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎరువుల బుకింగ్ యాప్‌ల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని రవికుమార్ ఆరోపించారు. యాప్ ద్వారా సకాలంలో ఎరువులు లభించక కొందరు దళారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బుకింగ్ యాప్‌లను రద్దు చేసి, గతంలో మాదిరిగా సులభంగా ఎరువులు అందించే విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ఎరువుల సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వూకంటి చిట్టిబాబు, శనగాని వినోద్, బైరు సాయి, ముదిగొండ వెంకన్న, ఊకె వెంకటేశ్వర్లు, కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ సేన 12వ ఆవిర్భావ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/ఇల్లందు:** సేవాలాల్ సేన 12వ ఆవిర్భావ వార్షికోత్సవ వేడుకలను ఇల్లందు మండలంలో మండల అధ్యక్షుడు, ధనియాలపడు ఉప సర్పంచ్ ఆంగోత్ ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పన్నెండేళ్లలో బంజారా గిరిజనుల సమస్యల పరిష్కారానికి సేవాలాల్ సేన అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. భవిష్యత్‌లో బంజారా సమాజం ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూనావత్ తిరుపతినాయక్, కార్యదర్శి బానోత్ వెంకన్న బాబు, నాయకులు ఆంగోత్ సేవ్య నాయక్, బానోత్ మంగీలాల్ నాయక్, కూన్సత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిరోధానికి ప్రత్యేక తనిఖీలు

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు దుమ్ముగూడెం పోలీసులు బుధవారం మండలంలో గంజాయి నిరోధక చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్ డాగ్ సహాయంతో అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై సోదాలు చేపట్టారు. లక్ష్మీనగరం, పద్దనల్లబెల్లి ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు గంజాయి రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సేవనం లేదా అక్రమ రవాణాపై సమాచారం తెలిపిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# బ్యాంకు లాకర్లు యమ డిమాండ్

**-ఖాళీలు లేక ఖాతాదారుల అవస్థలు**
**-పెరుగుతున్న వెయిటింగ్ లిస్టు**




**ప్రజాపక్షం/వైరా:** బంగారం, విలువైన తప్రాలు, ఇతర ముఖ్యమైన వస్తువులను భద్రపరచుకునేందుకు బ్యాంకు లాకర్లకు డిమాండ్ రోజురోజుకు పెరుగుతుంది. అయితే అందుకు అనుగుణంగా లాకర్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. లాకర్ కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్న వారికి చాలా శాఖల్లో వెయిటింగ్ లిస్ట్ దిక్కవుతుంది. నెలలు, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా లాకర్ లభించడం లేదని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోసా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ తదితర బ్యాంకులకు సంబంధించి 210కు పైగా శాఖలు ఉన్నాయి. వీటిలో కొన్ని శాఖలు మాత్రమే లాకర్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. స్థలాభావం, ఇప్పటికే ఉన్న లాకర్లు వినియోగంలో ఉండటంతో కొత్తగా లాకర్లు కేటాయించలేకపోతున్నామని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. ఖాళీ అయిన లాకర్లను వెయిటింగ్ లిస్టులు ఉన్నవారికి వరుస క్రమంలో కేటాయిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. ఇంట్లో బంగారం ఉంచేందుకు భయం ఇళ్లలో చోరీలు పెరగడం, భద్రతపై ఆందోళనలు, బంగారం ధరలు భారీగా పెరగడం లాకర్ల డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. భార్యాభర్తలు ఉద్యోగాలక వెళ్లే కుటుంబాలు, పండుగలు, విహారయాత్రలకు ఊళ్లకు వెళ్లే సమయంలో ఇళ్లను దొంగలు లక్ష్యంగా చేసుకునే ఘటనలు జరుగుతున్నాయి. ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధులను బెదిరించి దోపిడిలకు పాల్పడుతున్న ఘటనతో ప్రజలు ఇంట్లో బంగారం ఉంచేందుకు వెనుకంజ వేస్తున్నారు. పెళ్లిళ్లు, పండుగలు వంటి సందర్భాల్లో మాత్రమే ఆభరాలను వినియోగిస్తూ మిగిలిన సమయంలో వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం మంచిందని చాలామంది భావిస్తున్నారు. బ్యాంకు లాకర్లపై నమ్మకం కూడా డిమాండ్ పెరగడానికి మరో కారణంగా మారింది.

### లాకర్ కావాలంటే ఎఫ్‌డి తప్పనిసరా?

లాకర్ కోసం దరఖాస్తు చేసుకునే ఖాతాదారులకు కొన్ని బ్యాంకుల్లో రూ.25వేల నుంచి రూ.50వేల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సూచిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లాకర్ కేటాయింపును ఎఫ్‌డితో ముడిపెట్టడంపై ఖాతాదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం లాకర్ కేటాయింపు సమయంలో బ్యాంకులు మూడు సంవత్సరాల లాకర్ అద్దెతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో లాకర్‌ను తెరవడానికి అయ్యే ఖర్చులను కవర్ చేసి మొత్తాన్ని టర్మ్ డిపాజిట్‌గా తీసుకునే అవకాశం ఉంది. అయితే కేటాయింపునకు అదనపు ఉత్పత్తులు లేదా సేవలను తప్పనిసరిగా చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. దీంతో స్థానికంగా బ్యాంకులు అవనుసరిస్తున్న విధానాలపై ఖాతాదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ఖాళీలు ఎన్ని?వెయిటింగ్ ఎంత?

లాకర్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి బ్యాంకు శాఖలో మొత్తం లాకర్లు ఎన్ని? ప్రస్తుతం ఎన్ని వినియోగంలో ఉన్నాయి? ఎన్ని ఖాళీగా ఉన్నాయి? వెయిటింగ్ లిస్టులో ఎంతమంది ఉన్నారా? అనే వివరాలు పారదర్శకంగా అందుబాటులో ఉండాలని ఖాతాదారులు కోరుతున్నారు. లాకర్ సదుపాయం కోసం ప్రజలు నెలల తరబడి ఎదురుచూస్తున్న పరిస్థితుల్లో బ్యాంకులు లాకర్ల లభ్యత, వెయిటింగ్ లిస్టు, కేటాయింపు విధానం, అద్దెల వివరాలను స్పష్టంగా వెల్లడిస్తే గందరగోళానికి తెరపడే అవకాశం ఉంది.

# ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** జెడ్పీహెచ్ఎస్ రుద్రంపూర్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు చదవడం, రాయడం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడం, దానికి తగిన విధంగా స్పందించడం వంటి నైపుణ్యాలు తప్పనిసరిగా అలవడాలని సూచించారు. తెలుగు ఉపాధ్యాయురాలి ఆధ్వర్యంలో విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాధ మేడం ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్, పద్య, శ్లోకాల పోటీలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థిని యశ్విత తెలంగాణ తల్లిగా ఆత్మకథను ఏకపాత్రాభినయం ద్వారా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకుంది. అలాగే స్వాత్విక్ కాళోజీ పాత్రలో నటించి తన ప్రతిభను చాటుకున్నాడు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట రాజు, మదర్ థెరిసా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాకయ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, రాధ, రజియా సుల్తానా, వెంకటేశ్వర్లు, గణేష్ కుమార్, కవిత, కృష్ణవేణి, విజయనిర్మలతో పాటు పాఠశాల సిబ్బంది గోవర్ధనచారి, ధీరజ్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు మంచినీటిని విడుదల చేయాలి

**సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు వెంటనే మంచినీరు అందించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా రోజు విడిచి రోజు మంచినీరు గ్రామాలకు అందించేవారు. గత నాలుగు రోజులుగా గ్రామాలకు మంచినీరు సరఫరా ఇవ్వడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు ప్రజలు బావులు లేక బోరు లేక కేవలం మిషన్ భగీరథ నీరు ద్వారా మంచినీరు తాగుతున్నారు. గ్రామాల ప్రజలు మంచినీరు నాలుగు రోజులుగా రాకపోవడంతో ప్రజలు అల్లాడిపోతూ పిల్లలకు స్నానాలు చేయించాలన్నా, మంచినీరు తాగాలన్నా, ఇంట్లో పనులు చేయాలన్నా, మంచినీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఎప్పుడు మంచి నీరు వస్తాయో కనీసం ప్రజలకు సమాచారం కూడా లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఇది సరైనది కాదన్నారు. మంచినీరు అందించని పక్షంలో సింగరేణి ద్వారా ట్యాంకుల ద్వారానైనా గ్రామ ప్రజలకు మంచినీరు అందించి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది కానీ ఈ విషయాన్ని ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు అన్నారు. ఏ రోజుకు ఆ రోజే పంపులు వస్తాయని చెబుతూ నాలుగు రోజులు గడిచిన నేటికీ మోటర్ రిపేర్ కాక పోవడంతో నీరు అందించడంలో పూర్తిగా విఫలం జరిగిందని, ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ కమీషనర్ దీనిపై దృష్టి సారించి వెంటనే మోటర్ రిపేర్ చేయించి, మణుగూరు మున్సిపాలిటీ ప్రజలందరికీ, గ్రామాలకు మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రత్యామ్నాయం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆధర్ల రాములు, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, బోశెట్టి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవల్లో ఆశా జ్యోతులు..బతుకుల్లో చీకట్లు..!

**-అర్ధరాత్రి పిలిచినా నేనున్నానంటూ వచ్చే ఆరోగ్య సైనికులు..!**
**-పసికందు రక్షణ నుంచి సీజనల్ వ్యాధుల వరకు కంటికి రెప్పలా పర్యవేక్షణ**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నెలలు నిండిన గర్భిణికి అర్ధరాత్రి నొప్పులొస్తే ఆస్పత్రికి చేర్చే ఆధారం వారే...! పసికందు పుట్టిన క్షణం నుంచి వేళకు టీకాలు వేసి ఆయుష్షు పెంచే దేవతలు వారే..! ఊరిపై ఏ మహమ్మారి దాడి చేసినా, వానైనా ఎండుటెండైనా ఇంటింటి తలుపు తట్టి మందులందించే ఆరోగ్య సైనికులు వారే...! ఆమే ఆశా కార్యకర్త. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తూ రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఈ అభాగ్యుల జీవితాల్లో మాత్రం వెలుగులు నిండటం లేదు. నేలకొండపల్లి మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందిస్తున్న 74 మంది ఆశా వర్కర్ల శ్రమను ప్రభుత్వం గుర్తించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అడుగడుగునా సేవా ముద్ర, పెరిగిన పనుల భారం గర్భధారణ నమోదు నుంచి సుఖ ప్రసవం వరకు పర్యవేక్షణ, చిన్నారులకు పోలియో, ఈపీఐ టీకాల పంపిణీ, కుటుంబ నియంత్రణపై చైతన్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఓఆర్ఎస్, క్లోరినేషన్ అవగాహన, ఇలా గ్రామంలో ఏ ఆరోగ్య కార్యక్రమమైనా ఆశాల భుజాలపైనే నడుస్తోంది. చివరికి మారుమూల తండాల్లో కూడా ప్రజా ఆరోగ్యానికి నిలకడైన పునాది వేస్తున్నది వీరే. పనుల విస్తృతి పెరుగుతున్న కొద్దీ దానికి తగ్గ గుర్తింపు, సరైన పారితోషికం దక్కకపోగా, అధికారుల వేధింపులు, ఒత్తిళ్ల తట్టుకోలేక వారు నలిగిపోతున్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి.. తీరా హ్యాండిచ్చారు..! గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆశాలు మండిపడుతున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు సామాజిక భద్రతా పథకాలు, బీమా వర్తింపజేయాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజల ప్రాణాలు కాపాడే మాకు.. రక్షణ ఏది..?



జ్యోతి, నాచేపల్లి ఆశా వర్కర్, యూనియన్ మండల అధ్యక్షురాలు సమయం సందర్భం లేకుండా గ్రామీణ ప్రాంత ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, పసిపిల్లల ఆరోగ్యాన్ని కంటికి రెప్పలా చూసుకునే మాకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకపోవడం అత్యంత విచారకరం. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు పెంచి, బీమా సౌకర్యం కల్పించాలి.

### హక్కుల సాధన వరకు మా పోరాటం ఆగదు



న్యాయమైన పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు మారిశెట్టి వేంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి ""కార్మిక చట్టాల ప్రకారం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఆశా వర్కర్లకు నెలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, పింఛన్, బీమా సౌకర్యాలు కల్పించాలి. ఆశాల శ్రమను దోచుకోవడమే కాకుండా హామీలను నీరుగార్చడం సరికాదు.

# మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు భద్రత పెంచాలి

**-ఎంఎల్‌ఏ శంకర్, సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రాణహాని కలిగించేలా వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసీఆర్ చావును కోరుతూ కాంగ్రెస్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని వారు కోరారు. నేరాన్ని ప్రోత్సహించేలా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కఠినంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఎల్‌ఏ శంకర్‌తో పాటు నేరాన్ని ప్రోత్సహించారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, మండల నాయకులు మేడం లక్ష్మీనారాయణరెడ్డి, దారం కృష్ణారెడ్డి, మేడగం శ్రీనివాస్‌రెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, చేతుల పెద్ద వీరరాజు, బానోతు శ్రీను, వార్డు మెంబర్లు, నాగేశ్వరరావు, కోటయ్య, తుంగ నాగయ్య, మాజీ గ్రామ కమిటీలు కాసిమల్ల సురేష్, బోరెం శ్రీను, గుల్ మహమ్మద్, మాజీ వార్డు సభ్యురాలు కామిరెడ్డి పద్మ, మాజీ ఎంపీటీసీ దాసరి వెంకటరమణ, బండారి లక్ష్మీనారాయణ, మదమంచి రాజేశ్వరరావు, సాదిక్ పాషా, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేవీ రమణ, యారం వెంకట్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, పంగి సురేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

**-విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి**
**-రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి**
**- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు పోలీసులు మరింత చేరువగా ఉండేలా విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం అర్ధరాత్రి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌తోపాటు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును పరిశీలించి, రాత్రి వేళల్లో పోలీసుల అప్రమత్తతపై ఆరా తీశారు. అనంతరం జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన ఎస్పీ సీసీ కెమెరాల ద్వారా జరుగుతున్న పర్యవేక్షణను పరిశీలించారు. అనుమానాస్పద కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలర్టింగ్ అధికారులు, రౌండింగ్ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, రాత్రి వేళల్లో పోలీసుల నిఘాను బలోపేతం చేయాలని ఆదేశించారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రధాన రహదారులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసుల విజిబిలిటీని పెంచాలని ఆదేశించారు. సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డయల్ 112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కేసీఆర్‌కు భద్రత పెంచాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రాణహాని కలిగించే కుట్ర జరిగిందంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ భద్రతను పెంచాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు పాయం నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బాబా, ఉపాధ్యక్షుడు ఖయ్యూం, ఉప సర్పంచ్ ఆరీఫ్ ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో యువజన నాయకులు ఆదమ్, చింటూ, భాస్కర్, రామాంజిగూడెం వార్డు సభ్యుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కరుణించవా వరుణ దేవా..

**-బొడ్రాయి గ్రామ దేవతలకు మహిళల జలాభిషేకం**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** వర్షాలు లేక పంటలు ఎండిపోతుండటంతో వరుణ దేవుడిని కరుణించమంటూ ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దల పిలుపు మేరకు బొడ్రాయి, గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి వర్షాలు విస్తారంగా కురవాలని మొక్కుకున్నారు. గ్రామంలో వర్షాభావ పరిస్థితులతో బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామ దేవతలకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రార్థించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, బోర్లు నీటితో నిండి పంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీతారామ కాలువల భూసేకరణపై గ్రామసభ



**ప్రజాపక్షం/చండుగొండ:** సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణకు సంబంధించి గురంగూడెం, పోకలగూడెం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారులు గ్రామస్తులకు పలు సూచనలు, వివరాలు వెల్లడించారు. గ్రామసభల్లో ఎస్‌డీసీ పాల్వంచ వెంకటరావు, తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఆర్ఐ తిరుపతిరావు పాల్గొని భూసేకరణకు సంబంధించిన అంశాలను వివరించారు.

## చుక్క నీటి కోసం విద్యార్థుల పోరాటం

**-మూడు రోజులుగా నిలిచిన సరఫరా, తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు**



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన వసతి గృహంలో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు మోటారు పనిచేయకపోవడంతో పాటు భగీరథ నీరు కూడా సరఫరా కాక తాగునీరు, స్నానాలు, మరుగుదొడ్ల వినియోగానికి నీరు లేక అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యపై విద్యార్థులు ఆందోళనకు దిగడంతో ట్రైనీ ఐఏఎస్, ఎంఆర్‌ఓ మురళి హాస్టల్‌ను తక్షణమే పరిశీలించారు. సమస్యను పరిష్కరించేందుకు బోరు వేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హాస్టల్‌లో విద్యార్థులకు నిరంతర నీటి సౌకర్యం కల్పించాలని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరారు. ఈకార్యక్రమంలో పగడాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ పల్టీ పలువురికి గాయాలు

**- పరామర్శించిన సిపిఐ నాయకులు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అధైర్య పడొద్దు అండగా ఉంటామని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. వివరాల్లోకి వెళితే మండల పరిధి మొండికట్ట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ట్రాక్టర్‌పై మందెరికలపాడు గ్రామానికి వ్యవయసాయ పనుల కోసం వెళుతున్నారు. ఈక్రమంలో మందెరికలపాడు గ్రామం దాటిన తరువాత ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీనితో సుమారు 15 మంది కూలీలకు గాయాలైనాయి. క్షతగాత్రులను హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యుల సూచనతో మెరుగైన చికిత్స కోసం ముగ్గురిని కొత్తగూడెం తరలించారు. విషయం తెలుసుకొన్న సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు ఆసుపత్రికి వెళ్ళి బాదితులను పరామర్శించారు. ఈ సంధర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. బాదితులతో మాట్లాడుతూ అధైర్యపడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వీసంశెట్టి వెంట జిల్లా నాయకులు నుఇమ్మల రాంబాబు, నాయకులు చిల్లా క్రిష్ణ, మొండికట్ట సర్పంచ్ జర్పుల సంధ్య, మందెరికలపాడు మాజీ సర్పంచ్ కత్తి రమేష్ తదితరులున్నారు.

# 19న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల**




**ప్రజాపక్షం/మధిర:** విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని, ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మంజూరీలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. బుధవారం మధిరలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ మధిర మండల మహాసభను ఘనంగా నిర్వహించారు. ముందుగా మధిర పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం నుండి ఆర్‌వి కాంప్లెక్స్ మీదుగా ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న ఎంప్లాయిస్ యూనియన్ భవన్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. మహాసభ ప్రారంభం సూచికగా ఏఐఎస్ఎఫ్ శ్వేతా అరుణ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు కెజి నుంచి పిజి వరకు విద్యాసంస్థల్లో సమస్యలు విలయతాండవం చేస్తుంటే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా ప్రైవేట్ విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన దుయ్యబట్టారు. తక్షణమే సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల18న ఖమ్మంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, ఉగ్గం సురేష్, జిల్లా నాయకులు యంగల ఉజ్వల, చరణ్, ఏఐఎస్ఎఫ్ మధిర మండల కన్వీనర్ కళ్లెం అశోక్ పాల్గొన్నారు.

# భూ రీ సర్వే పనుల్లో వేగం పెంచాలి

**జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** భూముల రీసర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని తాటిగూడెం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానం, హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న రీ సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి వాటిని సంబంధిత భూరికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాటిగూడెం రెవెన్యూ పరిధిలో మొత్తం 660 ఎకరాల్లో రీ సర్వే చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం సర్వే నెంబర్లు 17 నుంచి 21 వరకు 35 ఎకరాల్లో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, సర్పంచ్‌బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నపూస వెంకటరెడ్డి, సర్వేయర్ కె.రాజశేఖర్, జిపివోలు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రవి, రైతులు వెన్నపూస నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, బూసుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబురెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు..

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై బిఆర్‌ఎస్ దళిత సంఘం నేతల ఫైర్**
**-కెసిఆర్ దళితుల అభ్యున్నతికి చేసిన సేవలను మరువలేం**



**ప్రజాపక్షం/వైరా:** మాజీ ముఖ్యమంత్రి బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌పై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై వైరా బిఆర్‌ఎస్ దళిత సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరాలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, ఆదూరి ప్రేమ్‌కుమార్, మున్నేరు సత్యానందం, గుజ్జర్లపూడి దేవరాజు, చాట్ల దానయ్య మాట్లాడారు. కెసిఆర్‌కు హాని కలిగించేలా ఆయన మరణాన్ని కోరుకునే విధంగా ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, వ్యక్తిగతంగా దూషించడం, ప్రాణహాని కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల సంక్షేమం కోసం కెసిఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, దళిత బంధు పథకం ద్వారా దళిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించే ప్రయత్నం చేశారని నాయకులు పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకనే కెసిఆర్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని అన్నారు. కెసిఆర్‌పై ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని బిఆర్‌ఎస్ దళిత సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దొంతబోయిన శ్రీనివాసరావు, బట్టా భద్రయ్య, విలాసాగరం నరేష్, రేచర్ల సైదులు, రాజు, సోమవరం వల్లెపు రాము, మాచర్ల శంకర్, ఏలూరు నర్సింహారావు, ముదిగొండ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ధర్నా




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలో నిత్యావసర సరుకుల ధరల విపరీతమైన పెరుగుదలను నిరసిస్తూ బుధవారం సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎపికెఎంఎస్ జిల్లా అధ్యక్షులు గోకినపల్లి ప్రభాకర్, జిల్లా గౌరవాధ్యక్షులు కంగాల కల్లయ్య మాట్లాడుతూ సామాన్యుల ఆదాయాలు పెరగపోగా, నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం రోజురోజుకూ చుక్కలనంటుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పేదల బతుకులు దుర్భరంగా మారాయని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తూ బ్లాక్ మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అడ్డగోలుగా పెంచిన ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, పివైఎల్ డివిజన్ కార్యదర్శి బాడిస లక్ష్మణరావు, పీఓడబ్లు మండల కార్యదర్శి కంగాల భూలక్ష్మీ, అలాగే పార్టీ నాయకులు కుంజా అర్జున్, కారం మల్లేష్, ధర్మల శ్రీరాములు, కొమరం చిన్నలక్ష్మీ, సింగమ్మ, కబ్బాడి కవిత, కుర్సం పోతురాజు, తెల్లం సత్యం, కంగాల కన్నయ్య, మడివి ముత్యాలు, పూర్రే చెల్లమ్మ, మయ్యబోయిన లక్ష్మీ, సోడెం రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శంకర్‌పై కేసు నమోదు చేయాలి




**ప్రజాపక్షం/పెనుబల్లి:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ దళిత సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుబల్లి బీఆర్‌యస్ నాయకులు పోలీస్ స్టేషన్ లో పలువురు వియం బంజర యస్ ఐ కి ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌కు హాని కలిగించేలా, ఆయన మరణాన్ని కోరుకునే విధంగా ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని నాయకులు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, వ్యక్తిగతంగా దూషించడం, ప్రాణహాని కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్‌యస్ మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, చెక్కిలాల మోహనరావు, చెక్కిలాల లక్ష్మణరావు, పెనుబల్లి సర్పంచ్ బానోత్ పాప,వంగా సురేష్, మందడపు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని సింగరేణి ఏరియా జీఎం కార్యాలయంలో పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను తెలంగాణ భాషా దినోత్సవంగా ఘనంగా బుధవారం నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటాచారి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ తెలంగాణ భాష, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన స్ఫూర్తిదాయకమైన "పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది" సందేశాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన ఆశయాల బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులను సర్పంచి పందిరి అంజయ్య లబ్ధిదారులకు కమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిపాలన అధికారి ఎం.శ్రీనివాస్, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని వల్లభి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ మహిళ చింతకాయల చంద్రకళ కూలి పనులకు వెళ్లి పాముకాటుకు గురై మృతి చెందడంతో మాజీ సర్పంచి, బీఆర్ఎస్ నాయకుడు పోట్ల వెంకట ప్రసాద్ ముందుకు వచ్చి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. మృతిరాలుకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి, తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిచ్చాల ధనమూర్తి, చింతకాయల లక్ష్మీ నర్సు, అల్లిక గోపాలరావు, కొండ విజయభాస్కర్, కొడారి పుల్లయ్య, జెట్టి కృష్ణ, ఏనుగుల బాబూరావు, ఏనుగుల వెంకటేశ్వర్లు, జి.సైదులు, ఎస్‌కె సైదులు, బింగి వెంకటనారాయణ, బింగి వెంకటేశ్వర్లు, పోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.శంకరయ్యపై మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఫిర్యాదు చేశారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అందించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదేశాలమేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ కృష్ణ, ముత్రిమేకల నాగేశ్వరరావు, పేరం వెంకటేశ్వర్లు, జర్పుల లక్ష్మణ్‌నాయక్, గుడిబోయిన దర్గయ్య, ముత్తయం పెద్ద కృష్ణారావు, మట్టా వెంకటేశ్వర్లు, రెడ్యానాయక్, వెంపటి ఉపేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్లు గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్రలో సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ పోషించిన వీరోచిత పాత్రను పలువురు గౌడ సంఘం నాయకులు స్మరించుకున్నారు. అనంతరం తాటి చెట్టు నుంచి జారిపడి గాయాపడిన జలగం ఉపేందర్‌గౌడ్, ఆలూరి యాళ్లగౌడ్‌కు జాగృతి ఫౌండేషన్ ద్వారా ఇద్దరికి చేరో ఐదు వేల చొప్పున ఆర్థికసహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు బోడపట్ల వెంకన్న, డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, బుడుగు శ్రీనివాస్‌గౌడ్, గండి రవి, లక్ష్మీ నారాయణ, గౌడ సంఘం పెద్దలు గడిపల్లి ఉపేందర్, పల్లె నరసింహారావు, రాములు, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బిజెపి గెలుపును అడ్డుకోలేరు..

**- కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది : బండి సంజయ్**





**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భద్రాచలంలో బిజెపి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల అనంతరం బిజెపి అధిష్ఠానం తెలంగాణపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, రానున్నది బిజెపి ప్రభుత్వమే అన్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న ఇళ్ల పథకం సన్నబియ్యం వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని బండి విమర్శించారు. గతంలో కేసిఆర్ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటూ బిజెపి కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అయినప్పటికీ వెనుకడుగు వేయలేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని బండి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస ప్రభుత్వం ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. పోలీసులు కేసులకు బిజెపి కార్యకర్తలు భయపడాల్సిన పనిలేదని, నాపై 109 కేసులున్నా వెనుకడుగు వేసేదే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు గడపగడపకు తీసుకెళ్లాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాగబాబు, రామ్మోహన్ నంబూరి రామలింగేశ్వరరావు తదితరులున్నారు.

**రామాలయంలో పూజలు :** భద్రాచల రామాలయాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో మేళతాళాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని స్వామిని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రామాలయం తరపున ఇఒ దామోదర్‌రావు జ్ఞాపికను స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మోడిపాలనలో దేశం అభివృద్ధి చెందాలని రాముల వారిని కోరినట్లు చెప్పారు. ఆలయాభివృద్ధిలో భాగంగా ప్రసాద్ స్కీమ్ నిధులు మంజూరయ్యాయని, భవిష్యత్‌లో రామాలయాభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శిగా నరాటి ఎన్నిక

**కార్యవర్గ సభ్యులుగా జమలయ్య, నగేష్ ఏకగ్రీవం**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ స్పష్టం చేసింది. కరీంనగర్‌లో ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయవంతంగా ముగిసిన ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఏకంగా 16 మంది కార్మిక నాయకులకు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం దక్కింది. రాష్ట్ర కార్యదర్శిగా నరాటి ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కంచెర్ల జమలయ్య, జి.నాగేష్, రాష్ట్ర సమితి సభ్యులుగా కె.సారయ్య, రాము, జి.వీరస్వామి, వంగా వెంకట్, వేల్పుల మల్లికార్జున్, దేవరకొండ శంకర్, అనాసరవు వెంకటేశ్వర్లు, గోనే మణి, ఎండి. నజీర్, అహ్మద్, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, కోరే కృష్ణ, మండల రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులకు కీలక స్థానాలు లభించడం పట్ల జిల్లా నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగ, సామాజిక భద్రతపై పాలకులు చేస్తున్న దాడిని తిప్పికొడుతూ కార్మిక లోకాన్ని ఏకం చేసి ఉద్యమిస్తామని, జిల్లా నాయకులకు సముచిత స్థానం దక్కేలా తోడ్పాటునందించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్‌కె. సాబీర్ పాషాలకు కౌన్సిల్ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# ప్రజాకవి కాళోజీ స్ఫూర్తి చిరస్మరణీయం

**- కలెక్టర్ ఎస్‌పి ఏపిఒ**
**- ఘనంగా కాళోజీ జయంతి**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** తెలంగాణ ప్రజల జీవన విధానం సమస్యలు ఆకాంక్షలు తన రచనల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్‌రాజ్, ఐటిడిఏ ఏపిఒ డేవిడ్ రాజు అన్నారు. ఆయా కార్యాలయాల్లో బుధవారం కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలేసి నివాళ్లర్పించారు. అనంతరం కలెక్టర్ ఎస్‌పి ఏపిఒ లు మాట్లాడుతూ కాళోజీ ప్రజలపక్షా నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించిన ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన కేవలం రచయితగానే కాకుండా ప్రజా ఉద్యమకారునిగా సామాజిక చైతన్య వేత్తగా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలంగాణ భాష, యాస సంస్కృతి ఆయన రచనల్లో ప్రధానంగా కనిపించాయని తెలిపారు. నా గొడవ వంటి రచనల ద్వారా ప్రజల సమస్యలను సూటిగా ప్రశ్నించి తన సాహిత్యాన్ని ప్రజాచైతన్యానికి వారధిగా మలిచారని చెప్పారు. నేటి తరం యువత కాళోజీ రచనలు చదివి స్ఫూర్తి పొంది ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాకవి కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల్లో కాళోజీ జయంతి వేడుకను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళ్లర్పించిన అనంతరం అజిత్ మాట్లాడుతూ తెలంగాణ స్వేచ్ఛ ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం కోసం కాళోజీ నారాయణ రావు చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తి దాయకం అన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ఎంచుకుని నేటి యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. కాళోజీ సాహిత్యం ఉద్యమ స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అజిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాణిక్యాల వినయ్ కొరిమి సంజయ్ జన్ను రాజ్‌కమల్ నవ్య హాసిని సాత్విక ప్రమీల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత : మేయర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతొక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని, సమాజారంలో సోదర భావాన్ని పెం పొందించేందుకు సాంప్రదాయ పం డుగలు ఎంతగానో దోహదపడ తాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. శ్రావణమాస బోనాల ఉత్సవాల సందర్భంగా బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్ పోశమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం భక్తుల కోస ం ఏర్పాటు చేసిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని గ్రామీణ సంస్కృతిని కాపాడుకో వాల్సిన బాధ్య త అందరిపై ఉందన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆరోగ్యాతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్పొరేట ర్లు ఎండి యూసుఫ్ భూక్య శ్రీనివాస్ గద్దం రాజయ్య గద్దం ప్రభాకర్ గద్దం సతీష్ శాంతిశ్రీ బండి నర్సింహ్ బోయిన విజయ్ కుమార్ గుర్రం వెంకటేశ్వర్లు సత్యనారాయణ చారి మంద నాగలక్ష్మి మిర్యాల రాము పాల్గొన్నారు.

# పల్లా సుధీర్ మృతి కుటుంబానికి తీరనిలోటు

**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్ రెడ్డి అకాలమృతి ఆ కుటుంబానికి తీరని లోటని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలోని పల్లా నివాసాన్ని ఆయన సందర్శించారు. దివంగత సుధీర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న నర్సింహారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సుధీర్ రెడ్డి మరణించడం కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పుత్రశోకంలో ఉన్న పల్లా నర్సింహారెడ్డి కుటుంబానికి పార్టీ శ్రేణులు ఎల్లవేళలా అండగా ఉంటాయని సాబీర్ పాషా పేర్కొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌కు సారయ్య, శంకర్





**ప్రజాపక్షం/ఇల్లందు:** కరీంనగర్ జిల్లా పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సెప్టెంబర్ 6 నుంచి 8వ రకు జరిగిన ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గం, కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇల్లందు నియోజకవర్గానికి రాష్ట్ర సమితిలో ప్రాతినిధ్యం దక్కింది. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడిగా కె సారయ్య వరుసగా నాలుగో సారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవరకొండ శంకర్ మూడోసారి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇల్లందు ఏరియా నుంచి రాష్ట్ర స్థాయి ప్రాతినిధ్యం లభించడం కార్మిక వర్గ పోరాటాలను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. వారి ఎన్నికపై ఏఐటీయూసీ ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, గడదాసు నాగేశ్వరరావు, షేక్ ముస్తఫా, జంగంపల్లి మోషే, తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమయపాలన పాటించాలని, రోగులకు ఎమర్జెన్సీ మందులు పాముకాటు ఏఎస్వి లు, ఏఆర్వి లు అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, మెడిసిన్స్ షాటేజ్ రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రోగులకు అందుతున్నటువంటి సేవలు గురించి అడిగి తెలుసు తెలుసుకున్నారు. జ్వర పీడిత బాధితులు పెరుగుతున్న కారణంగా పంచాయితీ సిబ్బంది తో కలిసి ఆశాలు డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించడం, హెల్త్ క్యాంపులు నిర్వహించడం, అదే విధంగా స్కూల్స్ మరియు హాస్టల్స్ విజిట్ చేయడం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పల్లెల్లో పరిశుభ్రత పచ్చదనము మురికివాడలో మురికి నిలవకుండా ఉండడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, హెడ్ నర్స్ ఇందిరా, నర్సింగ్ ఆఫీసర్ బి జాన్ బి, ఫార్మసీ ఆఫీసర్ శశికళ, హెచ్ వి రాధిక, హెచ్‌వి ప్రియదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మెనూ పట్ల అసంతృప్తి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అమలు చేయక పోవటం పై మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు అసంతృప్తిని వ్యక్తం చేశారు. మండలం లోని బోదుల బండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వంటలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించారు. విద్యార్థులను కలిసి విద్యా ప్రగతి ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం వంటలు వడ్డించకుండా పప్పుచారు చేయటం పట్ల అగ్రహం వ్యక్తం చేశారు. మెనూను ఎందుకు అమలు చేయటం లేదని ప్రధానోపాధ్యాయుల పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. భోజనాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అదే విధంగా ప్రతీ రోజు ఒక ఉపాధ్యాయుడు క్రమం తప్పకుండా విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని సూచించారు. మెనూ ను ఖచ్చితంగా అమలు చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి బీ,చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు నేమ్ బోర్డు, జాతీయ నాయకుల చిత్రాల వితరణ




**ప్రజాపక్షం/కూసుమంచి:** జుజ్జులరావుపేట ఉన్నత పాఠశాలకు నాగండ్ల నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి కామేశ్వరమ్మ రూ 20వేల విలువైన పాఠశాల నేమ్ బోర్డుతో పాటు జాతీయ నాయకుల చిత్రాలను తయారు చేయించి వితరణ చేశారు. బోర్డు ఆవిష్కరణ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం కామేశ్వరమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, ఉపాధ్యాయులు సునీత, వీరబాబు, పద్మ, కన్యశ్రీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏఐటియుసి రాష్ట్ర కమిటీలో ఖమ్మంకు సముచితస్థానం





**-ఉపాధ్యక్షులుగా రామాంజనేయులు, కార్యదర్శిగా శివరామకృష్ణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏఐటియుసి రాష్ట్ర కమిటీలో ఖమ్మం జిల్లాకు సముచిత స్థానం దక్కింది.కరీంనగర్ పట్టణంలో ఈనెల ఆరు నుంచి ఎనిమిది వరకు మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభల అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న తోట రామాంజనేయులు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కాగా జిల్లా అధ్యక్షులుగా ఉన్న రావి శివరామకృష్ణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గాదె లక్ష్మి నారాయణ (ఖమ్మం), నిమ్మటూరి రామకృష్ణ (సత్తుపల్లి), చెరుకూరి సీతామహాలక్ష్మి (అంగన్‌వాడీ), పిట్టల మల్లయ్య (గ్రామ పంచాయతీ వర్కర్స్), పేరబోయిన మోహన్‌రావు (ఆటో రంగం నుంచి ఎన్నికయ్యారు. ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్ లు వీరి ఎన్నిక పట్ల అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, శివరామకృష్ణ లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. సంఘటిత అ సంఘటిత రంగ కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

## పువ్వాడ ఉదయ్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ రాష్ట్ర నాయకులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పువ్వాడ ఉదయ్ కుమార్ 62వ జయంతి సందర్భంగా క్రాంతి ఘాట్‌లోని ఆయన స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ విస్తరణ కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఉదయ్‌కుమార్ కృషి చేశారన్నారు. ఖమ్మం నగరంలో పేదల ఇండ్ల స్థలాల కోసం చారిత్రిక పోరాటంలో ఆయన క్రియాశీల భూమిక పోషించారన్నారు. ఉన్నత విద్యావంతుడైన ఉదయ్‌కుమార్ నిరంతరం పేదల సమస్యల పరిష్కారానికి ఆలోచన చేసే వాడని ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకే కాకుండా యావత్ మంది పేదలకు తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, పువ్వాడ విజయలక్ష్మి , డాక్టర్ పువ్వాడ నరేన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించొద్దు

**-అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశం**



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి గ్రామ పంచాయితీలో ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభను జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ బుధవారం పరిశీలించారు. ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై అభ్యంతరాల పరిష్కారం కోసం బూత్‌ల వారీగా జరుగుతున్న దరఖాస్తులు పరిశీలనను ఆమె తనిఖీ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపునకు గురికాకుండా చూడాలని, మండల స్థాయి అధికారులు ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు గ్రామసభలకు హాజరై అవసరమైన పత్రాలు సమర్పించేలా బీఎల్‌వోలు అవగాహన కల్పించాలని, పరిశీలన వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో పద్మ, సర్పంచ్ మేదరి వీరప్రతాప్, కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు ముందస్తు అనుమతులు పొందాలని తల్లాడ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ కేటాయించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని అనుమతి పొందాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైరింగ్ ఉపయోగించి విద్యుత్ శాఖాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు డిజె సౌండ్ సిస్టంలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత పరిమితిలో సౌండ్ బాక్స్‌లను మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేషుకుమార్, పిచ్చయ్య, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## షాద్ నగర్ ఎంఎల్‌ఎపై బిఆర్‌ఎస్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేసిఆర్ మరణానికి సంబంధించి షాద్ నగర్ ఎంఎల్‌ఎ శంకరయ్య చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అతనిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్ పార్టీ బుధవారం పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, హవేలీ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు సహజమే కానీ బెదిరింపులు , హింసకు దారితీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని సాధించిన కేసిఆర్ మరణాన్ని కోరుకుంటున్నట్లు షాద్ నగర్ ఎంఎల్‌ఎ వ్యాఖ్యానించడం సరైంది కాదని బిఆర్‌ఎస్ నేతలు తెలిపారు. ఖమ్మం హవేలీ పోలీస్ స్టేషన్‌లో సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటేశ్వరరావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, దేవభక్తిని కిషోర్ తదితరులు ఫిర్యాదు చేయగా ఖమ్మం టూటౌన్‌లో నగర మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు, మచ్చ నరేందర్, పొన్నం వెంకటేశ్వర్లు, జక్కుల లక్ష్మ య్య, బుర్రి వినయ్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఖమ్మం వన్‌టౌన్‌లో షేక్ మగ్బూల్, కర్నాటి కృష్ణ, ఎండి ఖమర్ తదితరులు ఫిర్యాదు చేశారు.

## ఘనంగా వనమా విశ్వేశ్వరరావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు సీనియర్ రాజకీయ నాయకులు వనమా విశ్వేశ్వరావు జన్మదిన వేడుకలు వైరాలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ ఖమ్మం జిల్లా ప్రధమ ఉపాధ్యక్షులు నూకల వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు, నాయకులు పాల్గొని వనమా విశ్వేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వనమా విశ్వేశ్వరరావును పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల కృష్ణమూర్తి, నూకల ప్రసాద్, మద్దెల రవి, కొదుమూరి రవి, వనమా చిన్ని, కొల్లా రాంబాబు, లాల్‌మహ్మద్, గజ్జల కృష్ణమూర్తి, మిట్టపల్లి వినోద్‌కుమార్, కొణతాలపల్లి సుజిత్, చింతలపూడి వెంకటేశ్వరరావు, వజినేపల్లి చక్రవర్తి, సింగరపు నరేష్, రాజు, యంద్రపూడి శంకర్, దారా జగన్, భువనగిరి సతీష్, రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై విచారణ చేపట్టిన డిపివో



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితా గురించి జిల్లా పంచాయతీరాజ్ అధికారి వినోద్ కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఇండ్లను కేటాయించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కూడా అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామంలో అధికంగా పూరి గుడిసెలు ఉన్నందున సాధ్యమైనంత మేరకు ఎంపిక చేయాలని లేని పక్షంలో లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పివో రాంబాబు, కల్లూరు డిఆర్‌పివో విజయలక్ష్మి , హౌజింగ్ డిప్యూటీ ఇంజనీర్ జగ్రామ్, ఎంపిడివో శ్రీధర్ రాజు, ఎంపివో శ్రీహరి, సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.

## బర్లగూడెంలో పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల గుర్తింపు, వైద్య పరీక్షలపై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పశువులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు రైతులకు ఆరోగ్యం, పునరుత్పత్తి సమస్యలపై అవగాహన కల్పించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగులు మాట్లాడుతూ గర్భకోశ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే గర్భధారణ శాతం, పునరుత్పత్తి సామర్ధ్యం పెరుగుతాయని తెలిపారు. పశువులకు సమతుల్య పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స చేయించడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రైతులకు ఆర్థిక ప్రయోనం కలుగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో పశువులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో ఎన్ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ వెంకటేశ్, గోపాలమిత్రులు నాగు, లక్ష్మ య్య, ధర్మ పాల్గొన్నారు.

## సర్పంచుల గళం నొక్కే యత్నం

**-తొమ్మిది మంది బీఆర్ఎస్ సర్పంచుల ముందస్తు అరెస్టు**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** గ్రామ పంచాయితీలకు నిధులు విడుదల చేయాలని, సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ సర్పంచులను అశ్వాపురం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజాము నుంచే నిఘా పెట్టి మొత్తం 9 మంది సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సర్పంచుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసుల ద్వారా వారి గళాన్ని అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సర్పంచులు అప్పులు చేసినా బిల్లులు చెల్లించక ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రభుత్వం వెంటనే నిధులు, పెండింగ్ బిల్లులపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, సర్పంచులు మర్రి సంధ్యమల్లారెడ్డి, ముంద్రు రామకృష్ణ, ముర్రం సమ్మయ్య, తాటి వెంకటలక్ష్మి , కోంద్రు సమ్మయ్య, కలేటి నాగమణి, సున్నం తిరుపతమ్మ, కొరస అలివేలు, లకావత్ రామారావు ఉన్నారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి



**ప్రజాపక్షం/మధిర:** మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కవి, ప్రజాకవి, సాహితివేత్త కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాళోజి సాహిత్య సేవలు, సామాజిక చైతన్యం, తెలంగాణ భాషా సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కాళోజి రచనలు యువతలో సామాజిక స్పృహను, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పిసుజాత, అధ్యాపకులు పి.లక్ష్మీనారాయణ, షేక్ ఇమ్రాన్, ఎస్.జ్యోతిశర్మ, పృధ్విరాజ్, టి.ఆదర్శ్, శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు నానో యూరియా, డిఏపిపై అవగాహన

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సిరిపురం, గరికపాడు గ్రామంలో ఆత్మ యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో నానో యూరియా నానో డిఏపిపై క్షేత్ర ప్రదఽక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ తరపున నానో యూరియా నానోడ ఇఏపిపై పూర్తిగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నానో యూరియా యొక్క ఉపయోగాలు ఏ పంటలో ఎంత మోతాదులో వాడాలి, రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ రైతులు, గరికపాడు, ఆత్మ డైరెక్టర్ రామకృష్ణ, విస్తరణ అధికారి చామకూరి యశ్వంత్, ఇఫ్కో కంపెనీ డవలప్‌మెంట్ ఆఫీసర్ మహీంద్రారెడ్డి , మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాకవి కాళోజి జయంతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో జయంతి వేడుకలను ఎంపీడీవో జమలారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జమలారెడ్డితో పాటు కార్యాలయ సిబ్బంది కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిన కాళోజి సాహితీ, సామాజిక సేవలను ఈసందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చిన కాళోజి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.